క్లుప్తంగా

గ్రామదేవతలకు జలాభిషేకం



బాల్కొండ: సహకార సంఘం ఆధ్వర్యంలో ముప్కాల్ మండలం నాగంపేట్‌లో ఆదివారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ముందుగా పవిత్ర గోదావరికి కాలినడకన వెళ్లి గంగా జలాలను తీసుకువచ్చారు. గ్రామంలో వలగొడుగు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సహస్రార్జున జయంతి



ఆర్మూర్‌టౌన్: క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని చిన్నబజార్‌లో ఉన్న లక్ష్మీనారాయణ మందిరంలో సహస్రార్జున జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గోలబంగ్లా నుంచి సహస్రార్జున ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. క్షత్రీయ కులస్తులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్, బరాడ్ గంగామోహన్, సభ్యులు, క్షత్రీయులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగిస్తామన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు



బోధన్: బకాయి వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలనే డిమాండ్‌తో ఎన్డీఎస్ఎల్ ప్రధానగేటు ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి రిలే దీక్షలు 107వ రోజుకు చేరాయి. కార్మికులు లింగంగౌడ్, భావన, రుషి దీక్షలో కూర్చున్నారు. ఫ్యాక్టరీ మూతపడి తొమ్మిదేళ్లు పూర్తి కావొస్తున్నా.. ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీ భాగస్వామ్యంతో ఉన్న యాజమాన్యం బకాయి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఫ్యాక్టరీకి సంబంధించిన కోట్ల విలువైన భూములను అమ్మి సొమ్ము చేసుకుందామని యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని, తమ వేతన బకాయిల సమస్య పరిష్కరించకుండా ఆస్తులు అమ్ముతామంటే సహించబోమన్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామంలో ఆదివారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో పెద్దమ (వనదుర్గాదేవి) ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి

- దోచుకోవడం, దాచుకోవడానికే షకీల్ పరిమితం
- ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



నెహ్రూనగర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): ఈ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలం పోచారం, జంలం, నెహ్రూనగర్, ధర్మారం గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ తన పదవీకాలంలో దోచుకోవడం, దాచుకోవడానికే పరిమితమయ్యారని విమర్శించారు. భూకబ్జాలు, ఇసుక, మొరం దందాలు చేస్తూ ప్రజల క్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. ఆయా గ్రామాల్లో సుదర్శన్‌రెడ్డికి ప్రజలు ఘనస్వాగతం పలికారు. పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, లింగం, నారాయణ చౌదరి, నేరడి సాయిలు, రవికుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌లో బీజేపీ గ్రామ ముఖ్య నాయకులు, యువకులు 30 మంది వరకు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సుదర్శన్ రెడ్డి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముఖ్య నాయకులు వినోద్‌కుమార్, డాక్టర్ కృష్ణంరాజు, జితిన్, మోహన్, సాంబశివరావు, ప్రసాద్ ఉన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియర్ నాయకుడు, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సుదర్శన్‌రెడ్డి మంత్రి హోదాలో చేసిన అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరామని పేర్కొన్నారు. సర్పంచ్ కుమార్, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, రాంగోపాల్, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏరుగంటి లింగం పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్



కాంగ్రెస్ కండువా కప్పుతున్న సునీల్



పల్లికొండ వీడీసీ సభ్యులతో ముత్యాల సునీల్

భీమ్‌గల్ : బాల్కొండ నియోజకవర్గ ప్రజలు అరాచకాలకు వ్యతిరేకంగా మార్పు కోరుకుంటున్నారని, అహంకారాన్ని ఓడించి ప్రేమను గెలిపించుకోవాలనుకుంటున్నారని కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ అన్నారు. మండలంలోని పల్లికొండ గ్రామాభివృద్ధి కమిటీకి చెందిన ఎనిమిది మంది సభ్యులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి సునీల్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా కష్టపడి కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరిగి కాంగ్రెస్ గూటికి..

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన డీసీసీ డెలిగేట్ జైడి రవి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి ఆదివారం ఉదయం సొంతగూటికి చేరగా, ముత్యాల సునీల్ కాంగ్రెస్ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

- బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ



పార్టీలో చేరిన వారితో అన్నపూర్ణమ్మ

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్: బీజేపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు దిమ్మతిరిగిందని, మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. మానాల పరిధిలోని వీరునితండాకు చెందిన ఉపసర్పంచ్ లావూడ్య నరహరి అన్నపూర్ణమ్మ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ మేనిఫెస్టోలో రాష్ట్ర ప్రజలకు లబ్ధి చేకూరే పథకాలను పొందుపర్చారన్నారు. 'వరి వేస్తే ఉరేసుకోవాలి' అని అన్నవారు కావాలి? లేక క్వింటాల్ వడ్లకు రూ.3100 మద్దతు ధర ప్రకటించిన బీజేపీ కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో ప్రజలను మోసంచేసినట్టు తెలంగాణలో కూడా మోసంచేయడానికి ఆరు గ్యారంటీల పేరుతో ముందుకు వస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గెలిస్తే పార్టీ మారబోమని గ్యారంటీ ఇస్తారా? అని ప్రశ్నించారు. పార్టీ మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘం సభ్యులు..

భీమ్‌గల్ మండలం బెజ్జోరా దళిత సంఘం సభ్యులు బీజేపీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ అండగా నిలబడటంతో మాదిగ సంఘం సభ్యులు బీజేపీకి మద్దతు తెలుపుతున్నారన్నారు.

ఆంధ్ర శక్తులన్నీ ఏకమవుతున్నాయి



భీమ్‌గల్ : ప్రధాని మోదీ సహాయంతో తెలంగాణపై పెత్తనం చేసేందుకు ఆంధ్ర శక్తులన్నీ ఏకమవుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని సుదర్శన్‌నగర్ తండా, సంతోష్‌నగర్ తండా, జాగిర్యాల్, కుప్కల్ గ్రామాల్లో ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి ఉద్యమ సమయంలో రాజీనామా చేయమంటే పారిపోయాడని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటును జీర్ణించుకోలేక 11 రోజులు అన్నం తినని పవన్‌కళ్యాణ్ బీజేపీ సహకారంతో తెలంగాణలో అడుగు పెట్టాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చంద్రబాబు శిష్యుడని అన్నారు. కేసీఆర్ చేతిలో ఉంటేనే తెలంగాణ పదిలంగా ఉంటుందని, మరింత అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో స్వతంత్ర అభ్యర్థి చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ఎస్.రాజేశ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గైని మున్నూరుకాపు యూత్‌సభ్యులు సైతం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వేముల సమక్షంలో..

వేల్పూర్: రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో వేల్పూర్, మోర్తాడ్, భీమ్‌గల్ మండలాల్లోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గెన రాము, కార్యకర్తలు, మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు, పాలెం గ్రామానికి చెందిన కుర్మసంఘం సభ్యులు, రామన్నపేట్, గోన్‌గొప్పులకు చెందిన యువకులు, భీమ్‌గల్ రజక సంఘం, సంతోష్‌నగర్ తండా గిరిజనులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ప్రశాంత్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వేల్పూర్‌కు చెందిన ఆర్యవైశ్యులు ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేసి, ఆయనకు తీర్మానప్రతిని అందజేశారు.

అవినీతికి చరమగీతం పాడే అవకాశం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: తెలంగాణలో అవినీతి పాలనకు చరమగీతం పాడే అవకాశం ఎన్నికల రూపంలో వచ్చిందని ఆర్మూర్ నియోజవర్గం బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ ఆత్మీయ సమ్మేళనంలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ జీ మహతే, పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. పద్మశాలీలు కొండా లక్ష్మణ్‌బాపూజీని స్ఫూర్తిగా తీసుకుని ఎవరికీ భయపడకుండా బీజేపీకి సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. తాను ఎన్నికల్లో గెలిచిన వెంటనే పద్మశాలీ సంఘభవనాలు, కళ్యాణ మండపాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నాగ్‌పూర్ ఎమ్మెల్యే మోహన్ జీ మహతే మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె గంగారెడ్డి, జీవీ నర్సింహారెడ్డి, పాలెపు రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ద్యాగ ఉదయ్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయొద్దు



వర్ని (మోస్రా) : ఎస్సీ వర్గీకరణ చేయొద్దని డిమాండ్ చేస్తూ మోస్రా మండల కేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం మాలమహానాడు నాయకులు నిరసన తెలిపారు. వర్గీకరణ చేస్తే మాల, మాదిగల మధ్య తేడా వచ్చి ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని, అందరినీ ఒకే తాటిపై ఉంచాలని మాలమహానాడు బోధన్ డివిజన్ ప్రచార కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులు వర్గీకరణ చేస్తామని హామీలు ఇవ్వడం సరికాదని వర్గీకరణ చేసి ఎస్సీల మధ్య చిచ్చు పెట్టొద్దని ఆయన కోరారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు గుణపాఠం చెప్పాలి



పోతంగల్‌లో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నవీపేట: అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బోధన్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. నవీపేట మండలంలోని పోతంగల్, హనుమాన్‌ఫారం గ్రామాల్లో మోహన్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మంత్రిగా పని చేసిన సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా గెలుపొందిన షకీల్ బోధన్ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా మొదటిసారి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఐదేళ్లు ప్రజా సేవా చేసుకుంటానన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో మారుమూల గ్రామాల్లోని పేదలు ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ద్యాగ సరీన్, ఆనంద్, రచ్చ సుదర్శన్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసిందని, ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వరి రంగన్న, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయంలో పూజలు

బాల్కొండ: మంత్రి, బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలవాలని కోరుతూ.. మండలంలోని కిసాన్‌నగర్ కోదండ రామాలయంలో బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు సంక్షేమ ఫలాలు అందించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు నాగభూషణం, శరత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వి ప్రభాకర్

కమ్మర్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, అవినీతి బీఆర్ఎస్‌లను ఓడించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి ప్రభాకర్ పిలుపునిచ్చారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మోర్తాడ్, ఏర్గట్ల, భీమ్‌గల్ మండలాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నించే గొంతులను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు చర్యలకు పూనుకుంటూ మత ఘర్షణలకు పురమాయిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను అణిచి వేయడమే కాకుండా మేధావుల్ని హతమారుస్తున్న ఘటనలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మతోన్మాద ప్రభుత్వానికి అన్ని వేళలా సీఎం కేసీఆర్ వంతపాడడమే కాకుండా ఎన్నికల్లో, ఉద్యమ సందర్భంలో ఇచ్చిన వాగ్దానాలను విస్మరించారన్నారు. వీరిద్దరి చీకటి ఒప్పందంలో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ అవినీతి చర్యలపై కేంద్రం మౌనం పాటించడం చూస్తే తేలు కుట్టిన దొంగలాగా మోదీ షా పాలన ఉందని విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు దేవరాం, సారా సురేశ్, రాజేశ్వర్, అశోక్, కిషన్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఆదివారం రాబోయే ఎన్నికల్లో మతతత్వ పార్టీలను ఓడించాలని పిలుపునిస్తూ కరపత్రాలను సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు ఆవిష్కరించారు. నాయకుడు పిట్ల రామకృష్ణ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో మతతత్వ బీజేపీని, దాన్ని అనుసరిస్తున్న బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని ప్రజలను కోరారు. నాయకులు లింబాద్రి, కిషోర్, రాజేశ్వర్, రాములు, రాజన్న, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోతకాల పండుగ



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఆదివారం కోతకాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాస్టర్ దినకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నిజామాబాద్ సీఎస్ఐ చర్చి సహగురువు రెవరెండ్ ప్రకాష్ ప్రత్యేక దైవ సందేశం అందించారు. రైతులు తాము పండించిన పంటలో దశమ భాగం మొక్కుబడులు చెల్లిస్తూ కృతజ్ఞతగా జరిపే పండుగ కోతకాల పండుగ అని పాస్టర్ తెలిపారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.05
స్పార్క్ లైఫ్ (తెలుగు)-1.30, 10.30
మా ఊరి పొలిమేర-2(తెలుగు) - 5.00
కీడా కోలా(తెలుగు) - 7.50

స్క్రీన్-2 – మంగళవారం (తెలుగు)- 10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – అన్వేషి (తెలుగు)- 10.00
సప్త సాగరాలు(తెలుగు)- 12.50, 4.00, 7.10
టైగర్-3 (తెలుగు)- 10.20

స్క్రీన్-4 – టైగర్-3 (తెలుగు)- 11.15, 2.40, 6.05, 9.30

ఏడుసార్లు నంబర్ల మార్పు..

- పునర్విభజనతో బాల్కొండ నంబర్ 19
- గతంలో నియోజకవర్గానికి 230వ నంబర్



మోర్తాడ్: నియోజకవర్గాల పునర్విభజన జరిగిన ప్రతిసారి ఎన్నికల కమిషన్ నియోజకవర్గం సీరియల్ నంబర్‌ను మారుస్తుంది. ఇందులో భాగంగా బాల్కొండ నియోజకవర్గం సీరియల్ నంబర్ ప్రస్తుతం 19గా నమోదైంది. 1952లో నియోజకవర్గం ఆవిర్భవించగా అప్పటి నుంచి బాల్కొండ నియోజకవర్గాన్ని ఏడుమార్లు పునర్విభజన చేశారు. దీంతో సీరియల్ నంబర్ల సంఖ్య ఏడుసార్లు మారింది. 1952లో హైదరాబాద్ రాష్ట్రం పరిధిలో బాల్కొండ నియోజకవర్గం ఉండగా అప్పుడు ఈ నియోజకవర్గం సీరియల్ నంబర్ 95గా నమోదు చేశారు. 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోకి మారడంతో సంఖ్య 42గా నమోదైంది. 1962లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఎన్నికల కమిషన్ కేటాయించిన నంబర్ 245గా ఉంది. 1967లో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన చేయగా, అప్పుడు కేటాయించిన నంబర్ 227గా ఉంది. 1978లో ఒకసారి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పుడు ఎన్నికల కమీషన్ బాల్కొండ నియోజకవర్గాన్ని 230 నంబర్‌తో గుర్తించింది. 1978 నుంచి 2009 వరకు సుదీర్ఘకాలంపాటు బాల్కొండ నియోజకవర్గం సంఖ్య శాసనసభ చరిత్రలో 230గానే గుర్తించారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో బాల్కొండ నియోజకవర్గం సంఖ్య పూర్తిగా మారిపోయింది. ఈ నియోజకవర్గానికి 19వ నంబర్‌ను ఎన్నికల కమిషన్ ఇచ్చింది. సంఖ్యా పరంగా బాల్కొండ నియోజకవర్గానికి మొదటి నుంచి ఆఖరు స్థానమే ఉండగా ఇప్పుడు మాత్రం 19వ నంబర్‌ను కేటాయించారు. నియోజకవర్గం ఆవిర్భవించిన సమయంలో ఆఖరు స్థానంలో ఉన్న బాల్కొండ నియోజకవర్గం ఇప్పుడు మొదటి వరుసలోకి చేరడం విశేషం. పునర్విభజన జరిగిన ప్రతిసారి నియోజకవర్గం సంఖ్య మారడం పరిపాటే అని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

మైసమ్మ ఆలయంలో బాజిరెడ్డి పూజలు

మోపాల్: మండలంలోని మంచిప్ప శివారులోగల గండి మైసమ్మ ఆలయంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్రాబాద్ తండాలో జెడ్పీటీసీ కమలా నరేష్ సోదరి వివాహానికి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ దంపతులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే ప్రచారం

సిరికొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రూరల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తాటిపల్లి, చీమన్‌పల్లి, పందిమడుగు, దుప్య తండా, పాకాల, గోప్యనాయక్ తండా, వర్జన్ తండా, తూంపల్లి, కొండాపూర్, గోప్యతండా, సర్పంచ్‌తండాల్లో ప్రచారం చేస్తారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.